క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష గడువును మార్చి 31 నుంచి ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు భీమిలిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయ కుమార్ శనివారం తెలిపారు. ఈ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశంతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి ప్రవేశ పరీక్షలకు అర్హులు ఆన్‌లైన్‌లో https://aprs.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి సుందరకాండ పారాయణం

కొమ్మాది: మంగమారిపేట వారిజ ఆశ్రమం, శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరంలో వసంత నవరాత్రుల్లో భాగంగా ఆదివారం నుంచి రోజూ ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు సుందరకాండ పారాయణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని చెప్పారు.

జెడ్సీకి సచివాలయ కార్యదర్శుల ఫిర్యాదు

మధురవాడ: తమకు రావాల్సిన జీతాలు, ఇంక్రిమెంట్లు, బిల్స్ తరచూ ఆలస్యం అవుతున్నాయని జీవీఎంసీ జోన్-2 పరిధిలోని వివిధ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న కార్యదర్శులు, జెడ్సీ కనకమహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. వాటిని ప్రాసెస్ చేసే క్లర్క్‌ను మార్పు చేయాలని కోరారు. 49మంది సంతకాలతో కూడిన ఫిర్యాదు ఇచ్చారు. శుక్రవారం మహిళా పోలీసులు కూడా ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని సూపరింటెండెంట్ అప్పలరాజును జెడ్సీ ఆదేశించారు.

మినీ వ్యాన్ డ్రైవర్ల ఆందోళన

పద్మనాభం: తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మినీ వ్యాన్ల డ్రైవర్లు మద్దిలో శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ మినీ వ్యాన్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని, వారికి పీఎఫ్ ఈఎస్ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు ఎస్.అప్పలనాయుడు, ఆర్.సురేష్, బి.నాగరాజు, ఎస్.పరమేష్ పాల్గొన్నారు.


స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

మధురవాడ: సాయిరాం కాలనీ ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఓ స్క్రాప్ దుకాణంలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. కాపర్ కోసం తుక్కు వైర్లు తగులబెడుతున్న క్రమంలో పక్కనే దుకాణాన్ని ఆనుకుని ఉన్న చెట్లు, ఇతర చెత్తకు అంటుకోవడంతో దట్టమైన పొగతో 5.30 గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. స్థానికులు, స్క్రాప్ దుకాణం నిర్వాహకులు అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు.

రూపాకుల విశాలాక్షికి ఘన నివాళులు

పద్మనాభం: స్వాతంత్ర్య సమరయోధురాలు, తామపత్ర గ్రహీత రూపాకుల విశాలాక్షి జయంతిని పాత కొవ్వాడ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. గాయత్రి కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, ప్రకృతి చికిత్సాలయం, మండల బీజేపీ శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు పాల్గొని, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో విజయ్ కుమార్, ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవి కుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎస్ఆర్ఐటీ వార్షికోత్సవం



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీ 14వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వేడుకలకు ముఖ్యఅతిథులుగా సీయెంట్ గ్లోబల్ పీపుల్స్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ అర్వింద్ మాథుర్, హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ వీవీ రాజశేఖర్ హాజరయ్యారు. వీరి చేతుల మీదుగా కళాశాలకు విశిష్ట సేవలు అందించిన అధ్యాపకులకు సేవా పురస్కారాలు, ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఈవో పి.ఎస్.రాజు, కార్యదర్శి ఎన్.ప్రసాదరాజు పాల్గొన్నారు.

కొండంత దేవుడికి అంత గుడిని కట్టలేకపోవచ్చు.. కానీ అనన్య భక్తితో విగ్రహాన్ని ప్రతిష్ఠించి, నిండు మనసుతో అర్చిస్తే అంతటి ఆనందం సొంతమవుతుంది. ఆ విధంగా వెయ్యి విగ్రహాల ప్రతిష్ఠే లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది సద్గురు సేవాశ్రమం. ఆలయాలు అంతగా లేని ప్రాంతాలను ఎంచుకుని ఈ విగ్రహాలను ప్రతిష్ఠిస్తోంది. ఇప్పటికే 899 విగ్రహాలను ప్రతిష్ఠించగా అందులో సుమారు 20 మినహా అన్నీ ఆంజనేయస్వామివే కావడం విశేషం. ఇప్పుడు 900వ విగ్రహంగా శివలింగాన్ని ఉగాది పర్వదిన వేళ అల్లూరి జిల్లా జి.మాడుగులలో ప్రతిష్ఠించనున్నారు.

సహస్ర సంకల్పం

వెయ్యి విగ్రహాల ప్రతిష్ఠే లక్ష్యం



శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ప్రతిష్ఠించిన ఆంజనేయుని విగ్రహం

- సనాతన ధర్మ సంరక్షణకు సద్గురు సేవాశ్రమం కృషి
- ఇప్పటికి 899 విగ్రహాల ప్రతిష్ఠాపన పూర్తి
- నేడు జి.మాడుగులలో 900వ విగ్రహం ప్రతిష్ఠ



అరకు మండలం పెదలబుడులో గరుత్మంతుని విగ్రహం



500వ విగ్రహంగా జి.మాడుగులలో ప్రతిష్ఠించిన పంచముఖ ఆంజనేయుడు



జి.మాడుగులలో 900వ విగ్రహమైన శివలింగం ప్రతిష్ఠకు ఏర్పాట్లు

తగరపువలస: మానవసేవ, మాధవసేవ, గోసేవ పరమావధిగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది జీవీఎంసీ 4వ వార్డు రామయోగి అగ్రహారానికి చెందిన సద్గురు సేవాశ్రమం. 2010 మే నెలలో ఈ సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన కోన అప్పలరాజు అలియాస్ యోగా రాజు 60 మంది వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించడమే కాకుండా 60 దేశవాళీ ఆవులతో గోశాల నిర్మించారు. మొదట్లో భీమిలి తీరప్రాంతాలైన అన్నవరం, కాపులుప్పాడ, నిడిగట్టు, చేపలుప్పాడ గ్రామాలలో పదుల సంఖ్యలో ఆలయాలు నిర్మించి, అందులో విగ్రహాలు ప్రతిష్ఠించారు. 2020 నుంచి మాధవసేవను విస్తృతం చేయాలన్న సంకల్పం కారణంగా మారుమూల గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలలో ఆంజనేయుని విగ్రహాలు ప్రతిష్ఠించడానికి నడుం బిగించారు. ఇప్పటి వరకు అరకు, పాడేరు, పెదబయలు, జీకే వీధి, హుకుంపేట, కొయ్యూరు, రాజఒమ్మంగి, జి.మాడుగుల, చింతూరు, ముంచంగిపుట్టు, అనంతగిరి, చింతపల్లి, డుంబ్రిగుడ మండలాలు శ్రీకాకుళంతో పాటు ఒడిశాలోని కోరాపుట్, జైపూర్, నవరంగ్‌పూర్ జిల్లాలలో విగ్రహాలు, ఆలయాలు కలిపి 899 నిర్మించారు. వీటిలో 20 వరకు మాత్రమే వేంకటేశ్వరస్వామి, శివాలయం, అమ్మవార్ల ఆలయాలు కాగా మిగిలినవన్నీ హనుమంతుని విగ్రహాలే కావడం విశేషం.

మూడేళ్ల క్రితం జి.మాడుగులలో రూ.50 లక్షలతో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాన్ని నిర్మించారు. హుకుంపేట మండలం మద్దివీధి శివాలయాన్ని పునరుద్ధరించారు. ములుసోబలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహాలు ప్రతిష్ఠించిన అన్ని ప్రాంతాల్లో మొదటి ఏడాది వరకు పూజా సామగ్రిని వారే అందిస్తారు. ఇప్పటి వరకు అలా రూ.54 లక్షల విలువైన సామగ్రిని అందించారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

విజయసాయి యోగా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా యోగాలో ఉచిత శిక్షణ, వైద్య శిబిరాల నిర్వహణ, తాగునీటి కొరత ఉన్నచోట బోర్ల తవ్వకాలు, టాంకర్ల ద్వారా తాగునీరు, పైపులైన్ల నిర్మాణం, గిరిజనులకు దుస్తులు, వంటపాత్రలు, చిత్రపటాల పంపిణీ చేపడుతూనే ఉన్నారు. ఈ సేవా కార్యక్రమాలు అన్నింటికీ ఇప్పటి వరకు దాతల సహకారంతో రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అంచనా.

1000వ విగ్రహం జీవీఎంసీ పరిధిలోనే..

ప్రస్తుతం 900వ విగ్రహాన్ని శివాలయంలో పాటు శివలింగాన్ని ఆదివారం ఉగాది పర్వదినాన అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో ప్రతిష్ఠించడానికి ఏర్పాటు చేస్తున్నారు. 1000వ విగ్రహం మాత్రం జీవీఎంసీ పరిధిలో జాతీయరహదారిని ఆనుకుని 25 అడుగుల మేర భారీగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ విగ్రహానికి స్థలదాతలతో పాటు 3 నుంచి 12 అడుగుల వరకు మరో 100 ఆంజనేయస్వామి విగ్రహాలు కావలసిన వారు తనను 9848649067 నంబరులో సంప్రదించాలని యోగా రాజు సూచించారు.

సనాతన ధర్మం కాపాడాలనే..



ఏజెన్సీ ప్రజలకు ఆలయాలు తక్కువగా ఉంటాయి. అందుకే వీళ్లు ఎక్కువగా రాళ్లను పూజిస్తుంటారు. సనాతన ధర్మాన్ని కాపాడుకుంటూ వారిలో భక్తిభావం పెంపొందించడానికి గాను ఉచితంగా విగ్రహాలు, పూజా సామగ్రి ఇవ్వడం ప్రారంభించాం. మొట్టమొదటిగా హుకుంపేట మండలం రాళ్లగడ్డలో మా తండ్రి గారైన కుంచయ్య పేరుతో ప్రారంభించిన యజ్ఞం వెయ్యి విగ్రహాల తరువాత కూడా కొనసాగుతుంది. – **యోగా రాజు, భీమిలి**

మళ్లీ మొదటికే కల్యాణ మండపాల వేలం



వేలం నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ అప్పలరాజు చిత్రంలో జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్‌లో కల్యాణ మండపాల వేలం మళ్లీ మొదటికే వచ్చింది. మధురవాడ జోనల్ కార్యాలయంలో శనివారం జోనల్ కమిషనర్ కె. కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ అప్పలరాజు వేలం నిర్వహించారు. ఆరిలోవ ఆఖరి బస్టాప్ కల్యాణ మండపం నిర్మాణపనులు పూర్తి కాని కారణంగా వేలం రద్దు చేస్తున్నామని, ఎప్పుడు నిర్వహించేది తేదీ తెలియజేస్తామన్నారు. మారికవలస ఆర్‌జీకే కల్యాణ మండపం పాటకు ఒక్కరు కూడా రాలేదు. చంద్రంపాలెం ఆదిత్యనగర్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపం పాటకు వి.వాసు, కొల్లి పైడిరాజు, షేక్ యాసిన్ హాజరు అయ్యారు. దేవుడు పాట 1.80కోట్లు మొదట ప్రకటించారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండో ఆప్షన్ కింద రూ. 52.62లక్షలు చెప్పారు. దానికి కూడా పాటదారులు మొగ్గు చూపలేదు. 56 జీవో ప్రకారం ఖాళీ స్థలానికి కూడా మార్కెట్ వాల్యూలో 10శాతం రేటు దేవుడి పాటలో కలుపుతున్నారని, మరింత తగ్గిస్తేనే పాటలో పాల్గొంటామని, లేకపోతే తమకు అవసరం లేదంటూ వెనుదిరిగారు. దీంతో వారి వద్ద నుంచి రాత పూర్వకంగా లెటర్లు తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తామని, పాట తేదీ తర్వాత ప్రకటిస్తామని జెడ్సీ కనకమహాలక్ష్మి చెప్పారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

తగరపువలస: చెత్త నుంచి సంపద తయారీపై శనివారం భీమిలి మండలం రేఖవానిపాలెం, ఆనందపురం మండలం వెల్లంకిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్‌లో భాగంగా ఆయా మండలాలలోని పంచాయతీల నుంచి ఎంపిక చేసిన పారిశుద్ధ్య కార్మికులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సమ్మిడి శ్రీనివాసరావు, కొయ్య రామకృష్ణారెడ్డి, ఉప్పాడ లక్ష్మణరావు పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద శనివారం గ్రీన్ అంబాసిడర్లు, మిత్రాలకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ కంటుబోతు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి విజయానికి నిరంతర కృషి



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్

తగరపువలస: భావితరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి విజయానికి నిరంతరం కృషి చేయనున్నట్టు శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ అన్నారు. శనివారం సాయంత్రం బైపాస్ రోడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన శ్రీబాసర లీడ్స్ స్కూల్ వార్షిక వేడుకలలో ఆయన మాట్లాడారు. వినూత్న పాఠ్యాంశాలు, సాంకేతిక ఆధారిత విద్య తమ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. వేడుకలలో డీన్ మజ్జి భాస్కరరావు, ప్రిన్సిపాల్ రేఖ, జోనల్ ప్రిన్సిపాల్ వీవీడి రమేష్, డిఫెన్స్ ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాళ్లు సీహెచ్ సురేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీలో ఎవరి వర్గం వారిదే'

తగరపువలస: టీడీపీ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా శనివారం భీమిలి మండలంలో పలుచోట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విడివిడిగా కార్యక్రమాలు జరుపుకొన్నారు. ప్రతి పంచాయతీలోనూ గతంలో వైఎస్సార్‌సీపీకి వెళ్లి తిరిగి పార్టీలోకి వచ్చిన వారిని కలుపుకోవడానికి పాత నాయకులు ఇష్టపడలేదు. దీంతో శింగనబంధ, లక్ష్మీపురం, మజ్జివలస, తాటితూరు, మజ్జిపేట తదితర పంచాయతీలలో వేర్వేరు వర్గాలుగా వ్యవస్థాపక దినోత్సవాలు జరుపుకోవలసి వచ్చింది. గ్రామాల మధ్యలో పాత నాయకులు ఉత్సవాలు చేసుకుంటే, పార్టీలు మారిన వారు గ్రామ శివారులో ఉత్సవాలు చేసుకున్నారు.


పీజీ విద్యార్థుల రక్తదానం

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ ఏక్యూజే పీజీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరానికి చెందిన బ్లడ్ డోనార్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సాసుపల్లి రాజకుమారి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఫరూక్, డైరెక్టర్ పి.సుధారాణి, డోనర్స్ క్లబ్ సభ్యులు రామకృష్ణ, ప్రతాప్, విశాల్, అంకిత్ పాల్గొన్నారు.

సమన్వయంతోనే రీ సర్వే విజయవంతం

పద్మనాభం: క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమన్వయంతో పని చేసినప్పుడే రీ సర్వే విజయవంతమవుతుందని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. కొవ్వాడ, పాండ్రంగి గ్రామాల్లో త్వరలో చేపట్టనున్న రీ సర్వేపై తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం సిబ్బందికి అవగాహన కల్పించారు. కొవ్వాడకు వేసిన ఐదు టీమ్‌లు, పాండ్రంగికి వేసిన ఐదు టీమ్‌లు సమన్వయంతో పని చేయాలన్నారు. డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కన్నబాబు, డీటీ చంద్ర శేఖర్, రీ సర్వే డీటీ వరలక్ష్మి, ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ పండగ



పీఎం పాలెం: కొత్త అమావాస్య సందర్భంగా పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో కొలువుదీరిన నూకాలమ్మ వారి పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కేఎన్‌పీ చక్రవర్తి, గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పొట్నూరులో..

పద్మనాభం: పొట్నూరులో నూకాలమ్మ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సతకం పట్టు వద్ద మహిళలు పూజలు చేశారు. అనంతరం రథాలతో ఆలయం వద్దకు వచ్చారు. మజ్జి, ముద్దాడ, అవనాపు వారి కుటుంబాలకు చెందిన మూడు రథాలను నూకాలమ్మ ఆలయం చుట్టూ మూడు సార్లు తిప్పారు. ఆదివారం తీర్థం జరుగుతుంది.

కొత్త చిగుళ్లతో శ్రీవిశ్వావసు వైపు..


- సంవత్సరాదికి ప్రజల స్వాగత సన్నాహాలు
- కళకళలాడుతున్న మార్కెట్లు



ఆనందపురం సర్వీస్‌రోడ్డులో విక్రయిస్తున్న పూజా సామగ్రి



సందడిగా ఆనందపురం పువ్వుల మార్కెట్



తగరపువలస: శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. పలు గ్రామాలలో అమ్మవార్ల జాతరలు పూర్తి కాగా కొత్త అమావాస్య వేళ మరిన్ని గ్రామాలు పండగలతో కళకళలాడుతున్నాయి. కొత్త చిగుళ్లతో చెట్లన్నీ పచ్చదనం సంతరించుకోగా వార్షిక పరీక్షలు ముగిసిన విద్యార్థులు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు. కొత్త ఏడాదిలో వ్యయం కంటే ఆదాయం బాగుండాలని, అవమానం కంటే రాజపూజ్యం మెండుగా ఉండాలని ఇష్టదైవాలను వేడుకుంటూ షడ్రుచులు మేళవించిన ఉగాది పచ్చడి తయారీకి దినుసులు సేకరిస్తున్నారు.

వేప పువ్వు, మామిడి ఆకులు..

పట్టణీకరణ నేపథ్యంలో గ్రామాలు కనుమరుగవుతున్న వేళ మామిడాకులు, వేపపువ్వు కూడా ప్రియమైపోయాయి. రూ.10 ఇస్తే గాని వేప పువ్వు, మామిడాకులు లభ్యం కావడం లేదు.మామిడి పిందె రూ.20, చెరకు గడ రూ.50 ఉండగా పువ్వుల ధరలు ఆకాశాన్నంటాయి. తమలపాకులు, చెక్కలు, కొబ్బరికాయలు, అరటిపండ్ల ధరలు రెట్టింపయ్యాయి. ఆనందపురం, తగరపువలస మార్కెట్లు వినియోగదారులు, విక్రయదారులతో రద్దీగా మారిపోయాయి.

అవంతిలో ముగిసిన యువజనోత్సవాలు



రెండోరోజు ఉత్సవాలను ప్రారంభిస్తున్న లా వర్సిటీ వీసీ సూర్యప్రకాశరావు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన అవెన్సిస్-2కె25 యువజనోత్సవాలు శనివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రానున్న కాలంలో మన దేశం ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మైలాన్ ఫార్మా లిమిటెడ్ ఏజీఎం కర్రి బాల మురళి, బ్రహ్మకుమారి మాధురి, అనిల్ నీరుకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమాదేవి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఎక్సలెన్స్ ఆఫ్ చీఫ్‌కోచ్ గౌహతి తదితరులు ప్రసంగించారు. సినీ నేపథ్యగాయకులు మమన్‌కుమార్, నాదా ప్రియ హుషారైన పాటలతో ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ నందీష్, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్ బి.మురళీకృష్ణ, పిన్నింటి రామకృష్ణ, ఎంబీవీ రాజు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడను కెరీర్‌గా మలచుకోవాలి



ఇరు జట్లతో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్

తగరపువలస: ఫుట్‌బాల్ క్రీడను యువత కెరీర్‌గా మలచుకోవాలని రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ సూచించారు. చిట్టివలస బంతాట మైదానంలో జరుగుతున్న నమ్మి రాము మెమోరియల్ ఉత్తరాంధ్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ రెండోరోజు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడను బలోపేతం చేసి దాని ద్వారా పేద కుటుంబాల నుంచి వచ్చిన వారికి బ్రేక్ ఇవ్వదలిచినట్టు తెలిపారు. ఇటీవల అనంతపురంలో ఇదే విధంగా జట్లను గుర్తించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్కరమాని చినబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, పందిరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- నగరానికి చెందిన ఎస్ఆర్‌కేఎఫ్‌సీ, చిట్టివలస పోలమాంబ-1 జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన మొదటి సెమీ ఫైనల్స్‌లో పోలమాంబ జట్టు పెనాల్టీ షూటౌట్‌లో 5-4 తేడాతో గెలిచింది. శ్రీకాకుళం, చిట్టివలస పోలమాంబ-2 జట్ల మధ్య జరిగిన పోరులో చిట్టివలస 3-0 గోల్స్ తేడాతో సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించింది. నగరానికి చెందిన శబరి, విజయనగరం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో శబరి జట్టు 3-0గోల్స్ తేడాతో విజయం సాధించింది.

శాప్ చైర్మన్ క్రీడా కేంద్రాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న శాప్ చైర్మన్

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు విశాఖలోని క్రీడా సెంటర్లను శనివారం పరిశీలించారు. తొలుత కొమ్మాదిలో పారా స్పోర్ట్స్ శిక్షణసెంటర్‌కు కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. కొమ్మాదిలోని క్రీడావికాస కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి రెండు నెలలకు విశాఖ వస్తానని, పురోగతి పరిశీలిస్తానని తెలిపారు. సాక్షితో మాట్లాడుతూ రుషికొండ బీచ్‌లో తిరిగి వాటర్‌స్పోర్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. దానిలో భాగంగానే వాటర్ స్పోర్ట్స్‌తో పాటు అడ్వెంచర్ యాక్టివిటీస్ నిర్వహించేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. పారా స్పోర్ట్స్ శిక్షణ కేంద్రాన్ని నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు.

నేడు ఉదయం 6.30 నుంచి సర్వ దర్శనాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం (టీటీడీ) లో ఆదివారం తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, టెంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

నూకాలమ్మ ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాల నేపథ్యంలో ఆలయం వద్ద ఏర్పాట్లు, సదుపాయాలను దేవదాయ శాఖ సహాయ కమిషనర్ తుమ్మల అన్నపూర్ణ శనివారం పరిశీలించారు. క్యూలైన్లు, టిక్కెట్ కౌంటర్లు, ప్రసాదాల విక్రయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆదివారంతో ఉత్సవాలు ముగుస్తుండగా సోమవారం ఇక్కడ జరగనున్న హుండీల లెక్కింపును పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు తెలిపారు. దర్శనానికి వచ్చిన భక్తుల్లోని చిన్న పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు, క్యూలైన్లలో ఉన్న భక్తులకు వాటర్ బాటిళ్లు అందించారు. ఉత్సవ నిర్వహణ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ ఈవో బొంగరాల మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో నేడు ఉగాది వేడుకలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శ్రీరాధా మదన మోహన్ మందిరంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు అంబరీషదాస తెలిపారు.